
# కలవరమాయె మదిలో...




**పెళ్ళిచూపుల్లో కుందన నన్ను చాలా ఆకట్టుకొంది. గొప్ప అందగత్తె కాకపోయినా ఆ నిర్మలమైన కళ్ళు నన్నెంతో ఆకర్షించాయి. ముఖ్యంగా ఆ చిరునవ్వు...వెన్నెల్లో తడిసిన మల్లెపువ్వంత స్వచ్ఛంగా ఉంది!**

నేనెలాంటి అమ్మాయిని కోరుకుంటున్నానో కుందన సరిగ్గా అలాంటి అమ్మాయి అనిపించింది. మూర్తి ఆమె గురించి చెప్తూ "నీలాగే తనది కూడా నెమ్మదైన స్వభావం. మొహమాటం ఎక్కువ. సరిగ్గా నువ్వెలాంటి భార్యని కోరుకుంటున్నావో అలాంటి లక్షణాలన్నీ వున్న అమ్మాయి మా సిస్టర్" అన్నాడు. మూర్తి కుందనకు పెదనాన్న కొడుకు.

మూర్తి నాకు నా కొలీగ్ శ్రీధర్ ద్వారా పరిచయమయ్యాడు. నా కథలు చదివానని చెప్పాడు. అప్పుడప్పుడూ కథలు రాస్తుంటాన్నేను.


కుందనకీ నాకూ ఎంగేజ్‌మెంట్ అయిందిగానీ పెళ్ళికి మాత్రం దగ్గర్లో ముహూర్తాలు కుదరలేదు. ఆరు నెలల తర్వాత పెట్టారు. అప్పటికి కుందన ప్రైవేటుగా చేస్తోన్న పి.జి.కూడా పూర్తవుతుందన్నది పెద్దవాళ్ల ఆలోచన.

కుందన సెల్ నెంబరిచ్చి అప్పుడప్పుడు మాట్లాడుతుండమని చెప్పాడు మూర్తి. అయితే నేను, కుందన ఇద్దరం మొహమాటస్థులమే కావడంతో ఫోన్‌లో పొడి పొడి మాటలే జరిగేవి.

మా నిశ్చితార్థం జరిగి ఇరవై రోజులు దాటింది. మధ్యలో అప్పుడప్పుడు తనతో ఫోన్లో మాట్లాడుతున్నాగానీ కుందనని ఒకసారి కలుసుకొంటే బాగుండుననిపిస్తోంది. కానీ కలవడం ఎలా?

ఓ ఆదివారం సాయంత్రం..సాయి మందిరం బైట పిట్టగోడమీద కూర్చుని నగర సౌందర్యాన్ని వీక్షిస్తున్నాను. చల్లగాలి ఆహ్లాదంగా వీస్తూంది.

మెట్లమీదుగా ఒకమ్మాయి నడుచుకొంటూ వచ్చి నా పక్కనుంచి వెళ్ళింది. ఆ అమ్మాయి నా వైపే చూస్తూ వెళ్ళినట్టు అన్పించింది. కొన్ని అడుగులు ముందుకు వెళ్ళి మళ్ళీ వెనక్కి తిరిగి చూసిందామె. నేను కూడా ఆవైపే చూస్తూండడంతో ఇద్దరి కళ్ళూ కలుసుకొన్నాయి. నేను కంగారుపడి మొహం తిప్పుకునేంతలో ఆ అమ్మాయి నా దగ్గరికొచ్చి "మీరు శేఖర్ కదూ" అంది.



నేను ఒకింత ఆశ్చర్యపడి "అవును మీరెవరు?" అన్నాను. ఆ అమ్మాయి నవ్వింది.

"ఈమధ్యనే మీ కథొకటి చదివాను 'ఆహ్లాదం' పత్రికలో. బహుమతి పొందిన మీ కథ నాకు బాగా నచ్చింది. అక్కడ మీ ఫోటో వివరాలు కూడా వేశారు. అందుకే మిమ్మల్ని గుర్తుపట్టగలిగాను" అందామె.

నా మనసు సంతోషంతో ఉప్పొంగింది. నాక్కూడా గుర్తింపు లభించిందనే ఆనందం...

ఎన్ని కథలు రాశారు...లాంటి ఒకటి రెండు వివరాలడిగాక తను వెళ్ళిపోయింది. తన పేరు చరిత అని చెప్పింది.

మరుసటి ఆదివారం చరితని మళ్ళీ అక్కడ చూశాకగానీ నాకర్థం కాలేదు..తను కూడా నాలాగే ప్రతి ఆదివారం అక్కడకు వస్తుందని!

చిరునవ్వులు..పలకరింపులు..కొంతసేపు కబుర్లు..మేమిద్దరం మంచి స్నేహితులమయ్యామనడంలో ఏమాత్రం సందేహం లేదు.

చరిత తన ఫోన్ నెంబరివ్వడంతో ఇద్దరం అప్పుడప్పుడూ ఫోన్‌లో పలకరించుకొంటున్నాం. చరితతో నా స్నేహం మొహమాటాల పరిధిని దాటి పర్సనల్ విషయాలు మాట్లాడుకొనేంతవరకూ వచ్చింది. తను బియ్యేస్సీ చేస్తోందిట. అప్పుడే పెళ్ళిచేసుకొనే ఉద్దేశం లేదని చెప్పింది.

నేను మాత్రం నా పెళ్ళి ఫిక్సయిందనే విషయం తనకి



**యం.రమేష్‌కుమార్**

చెప్పలేదు. ఎందుకో ఆ విషయం చెప్తే చరిత నాతో ఫ్రీగా ఉండదనే భయం కలిగింది.

ఒంటరిగా కూర్చొని నాలో నేను ఆలోచించుకుంటే నా ప్రవర్తన నాకే చిత్రంగా అన్పిస్తోంది. నేను ఇంతవ రకూ ఏ అమ్మాయితోనూ ఇంత ఫ్రీగా మాట్లాడింది లేదు. చిన్నప్పట్నుంచి పుస్తకాలే ప్రపంచం. డిగ్రీలో నా క్లాస్‌మేట్స్ నాకిచ్చిన బిరుదు పప్పుసుద్ద. అమ్మాయిల వంక చూడననీ, ఆ విషయాలు మాట్లాడితే పక్కకి వెళ్ళి పోతాననీ నాకా బిరుదు ఇచ్చేరు. నిజం చెప్పాలంటే నేని ప్పటివరకూ అలాగే వున్నాను. నా మొహమాటం మూలంగా మిగతావాళ్ళతో కలిసి ఎడ్జస్టవలేనేమో అని ఒక్కణ్ణే రూమ్ తీసుకొని ఉంటున్నాను. కానీ ఇప్పుడు ఈ మార్పేమిటో నాకే అర్థం కావడం లేదు. చరితతో సిన్సియర్‌గా స్నేహం మాత్రమే చేయదల్చు కుంటే నా పెళ్ళి కుదిరిందన్న విషయం తన కెందుకు చెప్పలేకపోయాను? అంతేకాదు ఈమధ్య కుందనతో ఫోన్‌లో మాట్లాడటం కూడా తగ్గించాను. ఇవన్నీ ఆలోచిస్తుంటే నాలో ఏదో కలవరం, సంఘర్షణ.

ఆదివారం చరితని కలిసినప్పుడు ఆమె సడన్‌గా ఓ మాటంది. "మీ రూమ్ ఇక్కడికి దగ్గర్లోనే అన్నారు కదా..మరి కనీసం కాఫీ కైనా నన్నెప్పుడూ పిలవలేదేం?" అని.

నేను ఉలిక్కిపడ్డాను. రూమ్‌కెళ్ళాక ఆలోచిస్తే ఈకాలం అమ్మాయిలు చాలా ఫాస్ట్ అనిపించింది. లేదంటే రూమ్‌లో ఒక్కణ్ణే వుంటున్నానని తెలిసి కూడా రూమ్‌కి ఆహ్వానించలేదేమని అడిగిందంటే అర్థమేమిటి?

ఏమైనా నేను మారాల్సిన అవసరం వచ్చిందనిపించింది. ఇక పప్పుసుద్ద అవతా రానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. కోరి మగువ వస్తుంటే కాదనేవాడు మూర్ఖుడే కదా!

ఆ వారంలో నాకు తీవ్రమైన జ్వరం వచ్చింది. డాక్టర్ వైరల్ ఫీవర్ అన్నాడు. గురు శుక్రవారాలు ఆఫీస్‌కి సెలవు పెట్టాను. జ్వరం తగ్గినా గానీ నీరసంగా ఉండటంతో శనివారం కూడా సెలవు పెట్టాను.

ఆదివారం నాటికి కొంచెం తేరుకొ న్నాను. ఆ మధ్యాహ్నం భోంచేశాక విశ్రాం తిగా పడుకొని ఆలోచించసాగేను. ఈరోజు ఏమైనా గానీ చరితని రూమ్‌కి ఆహ్వానించాలి. ఆ అమ్మాయి సంగతేమిటో తేల్చేసుకోవాలి. అసలు చరిత ఉద్దేశమే మిటి? కొంపదీసి నన్ను ప్రేమిస్తోందా? లేక వట్టి అభి మానమేనా? ఏమీ అర్థం కావడం లేదు.

సాయంత్రం అయిదు కాకముందే రూమ్ లాక్ చేసి బయల్దేరాను. అప్పటికే చరిత గుడికి వచ్చేసి నాకోసమే ఎదుర్చూస్తోంది. వైట్ బ్లాకలర్ కాటన్ చీరలో ఎంతో అందంగా ఉందామె.

కొంత సంభాషణ అయ్యాక "కాఫీ తీసుకొని వెళు దురుగానీ రూమ్‌కి రండి" అన్నాను. అన్నానేగానీ మన సులో గుబగుబలాడుతూనే ఉంది.

అయితే చరిత ఆ మాట వినగానే "సంతోషం. ఇప్ప టికైనా పిలిచారు. రావడానికి నాకేమీ అభ్యంతరం లేదు..పదండి" అంది.

ఆమె అంత త్వరగా ఒప్పుకోవడంతో నా హృదయం ఆనందంతో గంతులు వేసింది. చరిత స్వభావం అర్థమౌతున్నట్లే అనిపించింది.

రూమ్‌కి చేరి కాసేపు మాట్లాడుకొన్నాక "చరితా! అసలు నా రూమ్‌కి నువ్వు రావడం నిజంగా నేనింకా నమ్మలేకపోతున్నాను" అన్నాను.

ఆ మాట విని చరిత ఒక్కసారిగా పగలబడి నవ్వింది. నేను బిత్తరపోయి చూస్తున్నాను.

వెనక్కి వంగి నవ్వడంలో ఆమె భంగిమ నా మన సును రెపరెపలాడించింది. ఒకమ్మాయిని ఏకాంతంలో అంత దగ్గరగా చూడటం అదే మొదటిసారి నాకు. ఒంట్లో రక్తం వడివడిగా ఉరకలెత్తినట్టనిపిం చింది.

చరిత నవ్వాపి "మీరు చాలా తెలివైనవా రనుకొన్నాను" అంది. ఆ మాటలో లక్ష అర్థాలు ధ్వనించాయి నాకు. అప్రయత్నంగా తన చేతిమీద చేయి వేశాను.

చరిత దూకుడేమిటో అప్పుడే తెలిసింది నాకు. తేరుకొని చూసేసరికి మేమిద్దరం ఒకరి బిగికౌగిలిలో మరొకరున్నాం. ఆమె శ్వాస వేడిగా తగుల్తోంది నాకు. సరిగమలే రాని నా చేతివేళ్ళు ఆమె శరీర వాయిద్యం మీద కొత్త సంగతులేవో తడుముకొంటు న్నాయి.

కాలం ఘనీభవించిందనుకొన్నాను. కానీ అది పరిగెడుతూనే ఉందని ఫోన్ మోత ద్వారా అర్థమైంది. ఆ సమయంలో సెల్‌ఫోన్ మోగుతోంది. హెచ్చరించే సైరన్‌లా..కానీ ఇద్దరం పట్టించుకోలేదు. ఒకరినొకరు అల్లు కునే ప్రయత్నంలో తలమునకలౌతున్నాం.

సెల్‌మోత అంతకంతకూ ఎక్కువౌతున్న ట్టనిపించింది.

టక్కున మెలకువొచ్చింది నాకు. చూస్తే నేను మంచం మీదే పడి నిద్రపోతున్నాను. ఇదంతా కలా? ఒళ్ళంతా చెమటలు పట్టే శాయి. పక్కనే సెల్‌ఫోన్ నిజంగానే మోగు తోంది. ఆ మోతకే నాకు తెలివొచ్చింది.

టైమ్ చూశాను. నాలుగున్నర దాటు తోంది. అమ్మో చరిత వచ్చేస్తుంది. నేను



## ఆ అందమే వేరు!

ఒకప్పటి హీరోయిన్ మంజుల గ్లామర్ గురించి అప్పటి ప్రేక్షకులకు బాగా తెలుసు. అయితే ఆమె కూతుళ్లు కూడా హీరోయిన్లుగా మారిన సంగతి తెలుసు కదా! మంజుల ఆఖరి కూతురు శ్రీదేవి మాత్రం 'మా అమ్మ ఇప్పటికీ అందగత్తెనే. ఆమె అందం ముందు మా అక్కలుగానీ, నేనుగానీ పనికిరాను' అని వాళ్ల మమ్మీ గ్లామర్ గురించి తెగ పొగుడుతుంది శ్రీదేవి. ఎక్కడికైనా ఆ కుటుంబం కలిసి వెళ్తే ముందుగా మంజు లనే లోపలికి పంపిస్తారట ఈ అక్కచెల్లెళ్లు. తమని డామినేట్ చేసే తమ మమ్మీ అంటే తమకెంతో గర్వం అంటుంది శ్రీదేవి.

వెళ్ళాలి. సెల్ ఆగిపోయింది. తీసి చూశాను. ఫోన్ చరిత దగ్గర్నుంచి కాదు. మూర్తి దగ్గర్నుంచి. మిస్సెడ్ కాల్.

గబగబా తయారై సాయి మందిరానికి బయల్దేరాను. నేను అక్కడికి చేరుకోగానే సెల్ మళ్ళీ రింగయ్యింది. మూర్తి దగ్గర్నుంచే. ఆన్ చేసి "ఏమిటి విషయం?" అడిగాను.

"సాయి మందిరానికి వస్తున్నారా?" అడిగాడు.

అక్కడే వున్నానని చెప్పాను.

"అయితే వుండండి. నేనూ వస్తున్నాను. మీకో సర్‌ప్రైజ్" అని కట్ చేశాడు.

నాకేమీ అర్థం కాలేదు. ఈరోజు చరితని రూమ్‌కి పిలవాలని నేననుకుంటే ఇతనేమిటి ఇక్కడికొస్తున్నాడు. పైగా సర్‌ప్రైజ్ అంటాడేమిటి? ఆలోచిస్తూనే మెట్ల వంక చూస్తున్నాను. మూర్తితో ఇబ్బంది వచ్చి పడేట్టుంది. చరితతో నన్ను చూసేడంటే ఈ విషయం తీసుకెళ్ళి సరాసరి కుందనకు చెప్పినా చెప్తాడు.

నేను ఆలోచనల్లో ఉండగానే ఎదురుగా మూర్తి వస్తూ కనిపించేడు. అతని వెనకాలే వస్తున్న మనిషిని చూడగానే క్షణకాలం గతుక్కుమన్నాను. చిన్న స్టీలు సెజ్జిలో సామాన్లు పెట్టుకొని కుందన వస్తోంది!

ఇదేమిటి? ఈ మూర్తి ఇప్పుడు కుందనని వెంటబెట్టుకొచ్చేడు? నేను మొహంలో భావాలు కనిపించకుండా నవ్వుతూ నిలబడ్డాను. చరితకోసం ఎదురుచూస్తూంటే..కుందన వచ్చిందేమిటి..? అనుకొన్నాను.

దర్శనం చేసుకొన్నాక మూర్తి కుందనా దగ్గరకొచ్చారు. మూర్తి నా వైపే చూస్తూ అన్నాడు. "మీకు ఒంట్లో బాగాలేదనీ, మూడు రోజులుగా సెలవు పెట్టారనీ తెలియగానే మా కుందన కంగారుపడింది. మీరు ఈమధ్య ఫోన్ కూడా చెయ్యడం లేదట. తను చెయ్యడానికి మొహమాట పడింది. తన కంగారుచూసి ఎలాగూ ఈరోజు సాయి మందిరానికి మీరొస్తారని తెలుసు కాబట్టి వెళ్దామా అని అడిగితే వెంటనే నాతో బయల్దేరింది. తనంత ఆత్రుత పడుతుంటే మీకేమో కనీసం ఫోన్ చెయ్యాలని కూడా అనిపించలేదు"

మూర్తి నిష్ఠూరంగా ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు. నా బుర్రకి సరిగ్గా ఎక్కడం లేదు. కుందనకేసే చూస్తున్నాను. తన చూపుల్లో ఎలా వున్నారన్న పరామర్శతోపాటు ఆందోళన కనబడుతోంది.

మూర్తి చెప్పడం అయ్యాక ఏదో పనున్నట్టుగా పక్కకి వెళ్ళేడు. నేనూ, కుందనా ఎదురెదురుగా కూర్చున్నాం.

"వైరల్ జ్వరాలు ఒక్కోసారి టైఫాయిడ్‌లోకి దించుతుంటాయి. బ్లడ్‌టెస్ట్ అదీ చేయించుకొన్నారా?" అడిగింది కుందన.

"అలాంటిదేమీ లేదులే. తగ్గిపోయింది. అయినా జ్వరం వచ్చినందుకు ఆనందంగానే వుంది"

"అదేం?" కుందన కళ్ళల్లో ఆశ్చర్యం.

"ఏం లేదు. ఈ రకంగానైనా నిన్ను కలుకోగలిగానుగా" అన్నాను.

కుందన నవ్వింది. ఆ నవ్వు ఎంత మనోహరంగా ఉందంటే ఎండాకాలంలో శీతల పవనాన్ని స్పర్శించినట్టుంది. తాత్కాలికంగా చరిత నా మైండ్‌లోంచి వెళ్ళిపోయింది.

ఆ ప్రశాంతమైన సమయంలో దైవ సన్నిధిలో కుందనతో మాట్లాడడం ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. తను వెళ్ళాక నాకో విషయం స్పష్టంగా అర్థమైంది. కుందన నాకోసమే ఆలోచిస్తోంది. అప్పుడే నన్ను తన సొంత మనిషిగా చేసేసుకొంది. తన ఆశలన్నీ నామీదే పెట్టుకొంది. నా ఆరోగ్యంకోసం ఆందోళన పడుతోంది. తన ఆలోచనలనిండా నేనే నిండిపోయాను. మరి నేను. నేనేం చేస్తున్నాను. చరిత మైకంలో కూరుకుపోయాను. నాలో ఏదో సంఘర్షణ.

నా మనసులో అంతర్మథనం మొదలైంది.

కుందన నవ్వు, ఆమె సరళమైన కంఠస్వరం, మృదు మధురమైన మాటలు...

నా మనసులో చీకట్లు తొలగిపోతున్నాయి. చరితను కలవగానే నా పెళ్ళి ఫిక్సైన విషయం చెప్పేయ్యాలి. అక్కడితో ఆమెపట్ల నా ఆలోచనలకు అడ్డుకట్ట పడుతుంది. అంతేకాదు ఆమెక్కూడా నా పట్ల మరో భావమేదైనా ఉంటే తొలగిపోతుంది. ఈ సంఘర్షణ నా కొద్దు. నా పప్పుసుద్ద మనస్తత్వమే నాకు హాయి.

ఆలోచనల్లో వుండగానే సెల్‌మోగింది. చరిత నుంచే. "ఏమీ అనుకోవద్దనీ, ఈరోజు రాలేకపోయాననీ రేపు గుడి దగ్గరే కలుద్దాం..తప్పకుండా రమ్మని" చెప్పింది. ఈరోజు ఆమె రాకపోవడమే మంచిదైందనుకొన్నాను.

మరుసటి రోజు చరితను కలిసేను. మరోమాట లేకుండా ముందు నా పెళ్ళి విషయం చెప్పి "ఇంతవరకూ చెప్పనందుకు సారీ" అన్నాను.

చరిత నవ్వుతూ "నాకు తెలుసు బావగారూ" అంది.

చరిత చెప్పడం మొదలుపెట్టింది. "ఈ కొత్త పిలుపేమిటా..అని ఆశ్చర్యపడుతున్నారు కదా..నేను కుందన చెల్లెల్ని. నా పేరు చందన. నేను మీకు చెప్పిన నా వివరాలన్నీ అబద్ధం. ఇదంతా ఎందుకనుకొంటున్నారా? మా అక్కంటే నాకు చాలా ఇష్టం. ఎంత ఇష్టమంటే తన కోసం ఏదైనా చేసేంత. తన మనస్తత్వం నాకు బాగా తెలుసు. తను చాలా సెన్సిటివ్. పెళ్ళి విషయం మాట్లాడినప్పుడు తను 'నన్ను చేసుకోబోయేవాడు ధనవంతుడు కాకపోయినా ఫర్లేదు. ఏ దురలవాట్లూ లేకుండా ఉంటే చాలు. ముఖ్యంగా తన ప్రేమంతా నాకే చెందాలి అనేది. మీరు అక్కకి తగిన వరుడో కాదో తెలుసుకోవాలనిపించింది. అందుకే సాహసమనిపించినా ఈ రకంగా మీతో స్నేహం చేసుకొని గమనించాలనుకొన్నాను. మూర్తి అన్నయ్య ద్వారా మీ వివరాలు తెలుసుకొన్నాగానీ నాకు సంతృప్తిగా అనిపించలేదు. నేనే స్వయంగా రంగంలోకి దిగాను. ఈ విషయం అక్కతో సహా ఇంట్లో ఎవరికీ తెలీదు. నేను కాకినాడలో ఉన్న మా బాబాయ్‌గారింటి దగ్గరుండి కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తున్నాను. అక్క పెళ్ళి చూపుల సమయంలో నాకు పరీక్షలు ఉండటంతో రాలేకపోయాను. కుందనకు చెల్లెలుందన్న విషయం మీకు తెల్సుగానీ అది నేనే అని మీకు తెలీదు. అదే నాకు అడ్వాంటేజి అయింది. పరీక్షలయ్యాక నేను సెలవలకి వచ్చాను"

చరిత..అదే చందన ఆగింది. నేనింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. ఆమె కొనసాగించింది. "మీ ప్రవర్తన సంతృప్తికరంగా అనిపించినా గానీ మీ పెళ్ళి కుదిరిందన్న విషయం నాకు చెప్పకపోవడం నాలో కాస్త అనుమానాన్ని రేకెత్తించింది. అందుకే మీ ఆలోచనలెలా వున్నాయో తెలుసుకోవడం కోసం నేనే ధైర్యం చేసి నన్ను మీ రూమ్‌కి కాఫీ పిలవచ్చుకదా..అని అడిగాను. అయినా మీరు దాన్ని అడ్వాంటేజిగా తీసుకొని నాతో చెడుగా ఏమీ ప్రవర్తించలేదు. ఇప్పుడు మీ పెళ్ళి కుదిరిందన్న విషయం కూడా నాతో మీరు చెప్పాక నా సందేహాలన్నీ తొలగిపోయాయి. అక్కకు సరైన జోడీ మీరేనని నమ్మకం కుదిరింది. నేను చేసినదాంట్లో మీకేమైనా తప్పు కనిపిస్తే నన్ను క్షమించండి బావగారూ" చందన చెప్పడం పూర్తైంది.

నా మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. 'ఎంతలో ఎంత ప్రమాదం తప్పిపోయింది? నిన్న కుందన నన్ను కలవకపోయివుంటే నా ఆలోచనల్లో మార్పొచ్చేది కాదు. ఛ ఛ..చందన గురించి ఎంత తప్పుగా ఆలోచించాను? ఇంక నా మనసుని పక్కదారులు పట్టనివ్వను. కుందన కోరుకున్నట్లే నా సంపూర్ణమైన ప్రేమని తనకు అందిస్తాను' మనసులోనే దృఢంగా అనుకొన్నాను. కలవరం, కలకలం ఏమీ లేకుండా నా మనసిప్పుడు ప్రశాంతంగా వుంది.

☆

